ప్రజాశక్తి

సోమవారం 21 నవంబర్ 2022 8 పేజీలు

గుంటూరు పల్నాడు

రుణమివ్వరు.. పంట కొనరు..

- సంక్షోభంలో కౌలుసేద్యం
- శరాఘాతంగా 2019 కౌల్దార్ల చట్టం
- సమస్యలపై నేడు-రేపు

చిలకలూరిపేట వేదికగా చర్చలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

భూమి ఉన్న రైతుల కంటే భూమి లేని కౌలు రైతులు మరింత సంక్షోభంలో చిక్కుకున్నారు. కౌలు రైతులకు బ్యాంకులు పంట రుణాలివ్వవు.. అప్పులు చేసిన పండించిన పంటను ప్రభుత్వ ఏజెన్సీలు కొనవు. సాగు ధ్రువీకరణ పత్రాల కోసం భూ యజమానులు అంగీకరించరు.. ప్రభుత్వ పథకాలు అందవు.. మొత్తంగా పెట్టుబడికి భరోసా లేక, అప్పు పుట్టక, పంటలు అమ్ముకోలేక కౌలు రైతులు పడుతున్న బాధలు వర్ణణాతీతంగా ఉన్నాయి.

వ్యవసాయంలో కీలకంగా ఉన్న కౌలు రైతులను వైసిపి ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. 2011లో ఉన్న చట్టాన్ని మార్పుచేసి 2019లో కొత్త చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టం ప్రకారం కౌలు రైతులకు ఏ సాయం కావాలన్నా భూ యజమాని అంగీకారం తప్పని సరిగా మారింది. భూ యజమాని అంగీకారపత్రంతో సాగు ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలనే నిబంధనల మేరకు గుంటూరు, పల్నాడు జిల్లాల్లో సాగు ధ్రువీకరణ పత్రాలు (సిసిఆర్‌సి) జారీ చేస్తున్నారు. పల్నాడు జిల్లాలో అధికారులు నిర్ధారించుకున్న లక్ష్యం కంటే ఎక్కువగానే సాగు ధ్రువపంత్రాలు జారీ చేసినా బ్యాంకర్లు మాత్రం రుణాలు ఇవ్వడానికి ఆసక్తి చూపడం లేదు. గుంటూరు జిల్లాలో

▸ 2లో

భారీ ప్రదర్శన, బహిరంగ సభ

- చిలకలూరిపేటలో నేడు కౌలురైతు సంఘం 3వ రాష్ట్ర మహాసభ
- హాజరుకానున్న ఎఐకెఎస్ సహాయ కార్యదర్శి విజూకృష్ణన్

స్వాగత కార్యక్రమాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట,పల్నాడు జిల్లా

వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉండగా కౌలురైతులు దారుణ పరిస్థితులను ఎదుర్కొంటున్నారని కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు అన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలో సోమ, మంగళవారాల్లో సంఘం 3వ రాష్ట్ర మహాసభ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక పండరిపురంలోని ఏలూరు సిద్ధయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కౌలు రైతులు సమస్యల, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సి చర్యలు, ఉద్యమాలు, కార్యాచరణపై మహాసభల్లో చర్చిస్తామన్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు ఎన్‌ఆర్‌టి సెంటర్ వద్దున్న గ్రాండ్ వెంకటేష్ కల్యాణ మండపంలో పోపూరి శివరామయ్య ప్రాంగణంలో సంఘం జెండాను ఆవిష్కరిస్తామని, కామ్రేడ్ చేబ్రోలు భాస్కరరావు నగర్‌లో, కామ్రేడ్ తెళ్ల ఆదినారాయణ సభా వేదిక నుండి మహాసభ ప్రారంభం అవుతుందని చెప్పారు. ప్రారంభ సభలో ఆలిండియా కిసాన్ సభ (ఎఐకెఎస్) సహాయ కార్యదర్శి విజూకృష్ణన్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని, మహాసభల ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది మానుకొండ ఉపేంద్ర, ఆహ్వాన

▸ 2లో

రైతు కుటుంబాల్లో ఆర్థిక సంక్షోభం

- అనుబంధ రంగాలపైనా తీవ్ర ప్రభావం
- మతతత్వ విధానాలపై పోరుబాట
- విద్యుత్ సంస్కరణ బిల్లు ఉపసంహరణకు ఉద్యమం
- మలివిడత పోరాటానికి 26 నుంచి శ్రీకారం
- ముగిసిన ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశం

వార్త మెయిన్‌లో

రహదారుల మెరుగుదలకు చర్యలు

ఇంటర్వ్యూ

- రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు
- 16 అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణం
- రూ.145 కోట్లతో మార్కెట్ ఆధునికీకరణ
- ప్రజాశక్తితో మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు

8 లో

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

2 లో

- యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్
- ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలు చెల్లించండి
- 22న ఉమ్మడి జిల్లాల కలెక్టరేట్ల వద్ద ధర్నాలు

బర్నబాసు హత్య కేసులో

నిజాయితీగా విచారణ

- పోలీసులకు రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ ఆదేశం
- మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం, పొలం, స్థలం ఇవ్వాలని సబ్ కలెక్టర్‌కు సూచన
- బర్నబాసు కుటుంబానికి పరామర్శ

2 లో

బర్నబాసు కుటుంబాన్ని పరామర్శిస్తున్న విక్టర్ ప్రసాద్

అలరించిన కళా ప్రదర్శనలు

8 లో

నాటక ప్రదర్శనలో చిన్నారులు

కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న పోలీసులు

రవాణా శాఖఅధికారుల కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రహదారి ప్రమాదాల్లో మృతి చెందిన వారికి సంతాపం తెలియజేస్తూ క్షతగాత్రులకు సంఘీభావంగా గుంటూరులో రవాణా శాఖ అధికారులు ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీసు పేరేడ్ మైదానం నుంచి నగరంపాలెం మూడు బొమ్మల సెంటర్ వరకు ర్యాలీ జరిగింది. అనదపు ఎస్‌పి శ్రీనివాసరావు, ఉప రవాణాశాఖకమిషనర్ షేక్ కరీం, ఆర్ అండ్‌బి ఎస్‌ఈ నిర్మల, రవాణా,పోలీసు అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎం. హరిబాబు

భారీ ప్రదర్శన, బహిరంగ సభ

(మొదటి పేజీ తరువాయి)

సంఘం ప్రధాన కార్యదర్శి, కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ, కోశాధికారి బి.శంకరరావు పాల్గొటారని చెప్పారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు మహాసభల ప్రాంగణం నుండి ఎన్‌ఆర్‌టి సెంటర్, చౌత్రా సెంటర్, గడియార స్తంభం భారీ ప్రదర్శన ఉంటుందని, 5 గంటలకు కళామందిర్ సెంటర్ వద్ద బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. సభకు వై.రాధాకృష్ణ అధ్యక్షత వహిస్తారని, ఢిల్లీ రైతాంగ పోరాటం ముఖ్యనేతల్లో ఒకరైన విజూకృష్ణ ప్రధాన వక్తగా మాట్లాడతారని, అనంతరం కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు, ఉపాధ్యక్షులు వి.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు కె.రామారావు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి వై.గోపాలరావు ప్రసంగిస్తారని తెలిపారు.

నూతక్కిలో వీధికుక్కల స్వైరవిహారం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

నూతక్కిలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గత రెండేళ్లుగా గ్రామంలోని వీధికుక్కలపై నియంత్రణ లేకపోవడం తో సుమారు 50కు పైగా శునకాలు రోడ్లపై తిరుగుతున్నాయి. ఈ మధ్య కాలంలో ప్రసవించిన కుక్కలు రోడ్లపై వెళ్లే ప్రజలపై ఎగబడి కరుస్తున్నాయి. స్థానిక అంబేద్కర్‌కాలనీలో రోడ్లపై తిరగాలంటేనే ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఒక వీధికుక్క ఎనిమిది మందిని కరిచింది అంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్న విషయమై గ్రామ సచివాలయంలోని అధికారుల దృష్టికి ప్రజలు తీసుకెళ్లారు. అర్జీ రూపంలో ఫిర్యాదు చేయాలని, అప్పుడు కార్పొరేషన్ వారికి పంపుతామని, అప్పటి వరకు తాము చేసేందుకు ఏమీ లేదని సచివాలయం అధికారులు చెప్పడం గమనార్హం. వీధికుక్కల నియంత్రణ నిమిత్తం వాటికి ఇంజెక్షన్లు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

బర్నబాసు హత్య కేసులో నిజాయితీగా విచారణ

- పోలీసులకు రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ ఆదేశం
- మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం, పొలం, స్థలం ఇవ్వాలని సబ్ కలెక్టర్‌కు సూచన
- బర్నబాసు కుటుంబానికి పరామర్శ

పొన్నూరులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలేసి నివాళులర్పిస్తున్న విక్టర్ ప్రసాద్

ప్రజాశక్తి - గుంటూరు

బర్నబాస్ హత్య కేసును పోలీసులు నిజాయితీగా దర్యాప్తు చేసి నేరస్తులకు చట్ట ప్రకారం కఠిన శిక్షలు పడేలా చూడాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్ ప్రసాద్ ఆదేశించారు. పొన్నూరులో బర్నబాస్ హత్యకు గురైన నేపథ్యంలో ఆ కుటుంబాన్ని విక్టర్‌ప్రసాద్ ఆదివారం పరామర్శించారు. తొలుత పొన్నూరు అర్ అండ్ బి అతిథి గృహంలో తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, గుంటూరు అడిషన్ ఎస్పీ అనిల్ కుమార్‌తో సమావేశమయ్యారు. బర్నబాస్ హత్య కేసు విచారణ, పురోగతి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం చింతలపూడిలోని బర్నబాస్ భార్య నందిని, తల్లి శాంతమ్మ. పిల్లలను పరామర్శించారు. నేరస్తులకు శిక్షలు పడేలా అండగా ఉంటామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం బాధితులకు అందించే సహాయాన్ని అందిస్తామన్నారు. మృతుని కుటుంబానికి సత్వరమే ఆరు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించాలని, పొలం, ఇంటి స్థలంతో పాటు, ఉద్యోగం కల్పించాలని, పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్‌కు సూచించారు.

అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ వ్యాపారంలో ఎదుగుతున్నాడని, భవిష్యత్తులో తమ వ్యాపారాలకు అడ్డు వస్తాడని రేషన్ సిండికేట్‌కు చెందిన వ్యక్తులు అక్టోబరు 18వ తేదీన బర్నబాస్‌ను హత్య చేశారని, దీనిపై పోలీసులు ఇప్పటికే కిడ్నాప్, హత్య, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి 10 మందిని అరెస్టు చేశారని చెప్పారు. ఈ కేసులో మరో ఇద్దరికి సంబంధం ఉన్నట్లు మృతుని భార్య తెలిపారని, వీరి పేర్లనూ ఛార్జిషీట్‌లో చేర్చి అరెస్టు చేయిస్తామని అన్నారు. మృతుని కుటుంబానికి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం తొలుత రూ.4,12,250 ఆర్థిక సాయం, రెండున్నర ఎకరాల పొలం, ఇంటి స్థలంతో పాటు, మృతుని భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, పెన్షన్ అందించాలని సబ్ కలెక్టర్‌కు సూచించామని తెలిపారు. కలెక్టర్‌కూ సూచిస్తామన్నారు. మృతుని పిల్లలకు కార్పొరేట్ పాఠశాలలో ఉచిత విద్య, ఆ కుటుంబానికి ప్రాణ హాని లేకుండా పూర్తి రక్షణకు పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించామన్నారు.

బర్నబాసుకు చెందిన సెల్‌ఫోన్‌లో వివరాలు ఉన్నాయని అతని భార్య తెలిపారని, పోలీసులు సేకరించిన కాల్ డేటాను, ఇతర వివరాలను అందించాలని పోలీస్ శాఖకు సూచించామని చెప్పారు. తొలుత పొన్నూరు ఐలాండ్ సెంటరులోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి విక్టర్‌ప్రసాద్ పూలమాలలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరక్టర్ మధుసూదనరావు, తహశీల్దారు శ్రీకాంత్, సిఐ ఎం.బాబీ, ఎస్సీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రుణమివ్వరు.. పంట కొనరు..

(మొదటి పేజీ తరువాయి)

37,218 మందికి సిసిఆర్‌సిలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా 24,210 మందికి సిసిఆర్‌సిలు ఇచ్చారు. రూ.297.80 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా కేవలం 9 వేల మందికి రూ.31.07 కోట్లు రుణాలిచ్చారు. పల్నాడు జిల్లాలో 33,172 మందికి సిసిఆర్‌సిలు ఇవ్వాల్సి ఉండగా 39,973 మందికి జారీ చేశారు. అయితే వీరిలో కేవలం 3,378 మందికి రూ. 13.53 కోట్లు మాత్రమే రుణాలు ఇచ్చారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు 20 వేల మందికి టిడిపి ప్రభుత్వ హయాంలో రుణ మాఫీ జరగక వీరికి బ్యాంకర్లు రుణాలు ఇవ్వడం లేదు. పాత బకాయిలు వడ్డీతో కలిసి భారీగా బకాయిలు పేరుకుపోవడంతో పాత బకాయిలు కట్టలేక, కొత్త రుణాలు తెచ్చుకోలేక కౌలు రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

సి.సి.ఆర్.సిలు లేకపోవడం వల్ల చాలా మందికి రైతు భరోసా, పంటల బీమా వంటి సదుపాయాలు అందడం లేదు. సిసిఆర్‌సిలు ఉన్న ఓసీ రైతులకు ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వడం లేదు. బీమా సదుపాయం సొమ్ము భూ యజమాని ఖాతాల్లో జమ అవుతుంది. ఈ సొమ్ము కౌలు రైతులకు ఇవ్వాలన్న కనీస ధ్యాస కొంత మందికి ఉండటం లేదు. గ్రామాల్లో పెద్దల సమక్షంలో చర్చిస్తే కొంత మంది తన పొలంలో సాగు చేసిన కౌలు రైతుకు బీమా సొమ్ము ఇస్తున్నారు. కొంత మంది ఇవ్వడం లేదన్న విమర్శ ఉంది. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సబ్సిడీలు రైతుకు అందడం లేదు. పంటను అమ్ముకోవాలన్నా గుర్తింపుకార్డు లేక భూ యజమాని పేరుతోనే అమ్ముకోవాల్సి వస్తోంది. కొంత మంది అయినకాడికి అమ్ముకుంటున్నారు.

ఈ-క్రాప్, ఈకేవైసి సదుపాయం కౌలు రైతులు లేకపోవడం వల్ల వారికి ప్రభుత్వం నుంచి నేరుగా రావాల్సిన వివిధ సదుపాయాలు అందడం లేదు. సాగు నష్టాలతో ఆర్థిక ఇబ్బందులతో అనివార్యమైన పరిస్థితుల్లో ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి ఎక్స్‌గ్రేషియా కూడా రావడం లేదు. గుంటూరు,పల్నాడు జిల్లాలో లక్షన్నర మంది కౌలు రైతులు ఉన్నా 64 వేల మందికి అధికారులు సిసిఆర్‌సిలు ఇచ్చారు. సిసిఆర్‌సిలు ఉన్నా చాలా మందికి సదుపాయాలు అందడం లేదు. సిసిఆర్‌సిలు లేని వారి పరిస్థితి మరీ దయనీయంగా ఉంటోంది. ఈ సమస్యలన్నింటిపై చిలకలూరిపేటలో సోమ, మంగళవారాల్లో నిర్వహించే కౌలురైతు సంఘం రాష్ట్ర తృతీయ మహాసభలో చర్చించి పోరాటాలకు కార్యాచరణ రూపొందించనున్నారు.

శ్రీనివాసరావుపేటలో రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-గుంటూరు

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గిరిధర్, మేయర్ మనోహర్‌నాయుడు

అభివృద్ధి పనుల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని గుంటూరు నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు అన్నారు. ఆదివారం స్థానిక 18వ డివిజన్‌లోని శ్రీనివాసరావు పేట 6వ లైన్‌లో సిసి రోడ్డు, సిసి డ్రైన్‌ల నిర్మాణానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు.మేయర్ మాట్లాడుతూ నూతన పాలక వర్గం ఏర్పడ్డాక గుంటూరు నగరంలో సుమారు రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. 18వ డివిజన్ శ్రీనివాసరావు పేటలో రూ.19లక్షలతో సిసి రోడ్డు, సిసి డ్రైన్స్ నిర్మాణం చేయనున్నట్లు చెప్పారు. నగరంలో అభివృద్ధి పనులు పార్టీలకతీతంగా నిర్వహిస్తున్నామని, ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా ప్రధాన రహదారుల విస్తరణ పనులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నిమ్మల వెంకటరమణ, గేదెల నాగరంగమని రమేష్, జిఎంసి అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శనీయమైన వ్యక్తిత్వం ఎన్‌టిఆర్ సొంతం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

కొరియోగ్రాఫర్ గోగినేని సుధీర్‌కుమార్‌ను సత్కరిస్తున్న కమిటీ బృందం

సినీ రంగంలో, రాజకీయ జీవితంలో ఎంతో ఎత్తుకు ఎదిగిన ఎన్‌టిఆర్ వ్యక్తిత్వం ఎంతో ఆదర్శనీయమని పద్యకవి డాక్టర్ పాతూరి సుబ్రహ్మణ్యం అన్నారు. మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారధ్యంలో శకపురుషుని శతజయంతి పేరిట నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్థానిక పెన్షనర్స్ హోమ్‌లో 'ఎన్‌టిఆర్‌కు బిఎన్ రెడ్డికి గల అనుబంధం' అన్న అంశంపై చర్చ జరిగింది. ముఖ్య వక్తలుగా పాల్గొన్న డాక్టర్ పాతూరి సుబ్రహ్మణ్యం, చల్లపల్లి అశోక్ కుమార్‌లు ప్రసంగించారు. అనంతరం కళాకారుల సత్కారాల్లో భాగంగా పట్టణానికి చెందిన కొరియోగ్రాఫర్ గోగినేని సుధీర్‌కుమార్‌ను ఉత్సవ కమిటీ సత్కరించింది. కార్యక్రమంలో డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఈ శ్రీనివాసరావు, ఎం. కోటేశ్వరరావు, ఎం.రాఘవరావు, వి.శివప్రసాద్, డి.భాస్కర్, బి.మోహనరావు, యు. ధర్మారావు, టి.ఈశ్వర్, పి.గోపి, డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆధునిక దేవాలయాలు గ్రంథాలయాలు

- ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి
- ఘనంగా ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కుల,మత, రాజకీయాలకు అతీతంగా అందరూ వచ్చే ఏకైక ఆధునిక దేవాలయాలు గ్రంథాలయాలని శాసనమండలి సభ్యులు లేళ్ళ అప్పిరెడ్డి వ్యాఖ్యానించారు. మానసిక వికాసానికి, విజ్ఞాన సముపార్జనకు ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలకు వెళ్ళడం తప్పనిసరి అని ఆయన స్పష్టం చేశారు. ఈ నెల 14వ తేదీ నుంచి జరుగుతున్న 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా అరండల్‌పేటలోని జిల్లా గ్రంథాలయ సంస్థలో ఛైర్మన్ బత్తుల దేవానంద్ అధ్యక్షతన జరిగిన ముగింపు సభలో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రంథాలయాల నుంచే ఎన్నో జాతీయ ఉద్యమాలు పుట్టాయన్న వాస్తవాన్ని అందరూ గమనంలో ఉంచుకోవాలని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి కోరారు. విద్యారంగంతో పాటు మారుతున్న కాలానుగుణంగా డిజిటలైజేషన్ చేస్తూ గ్రంథాలయాలకు పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. గుంటూరు మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ, సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందినా గ్రంథాలయాల ప్రాముఖ్యత మాత్రం ఎప్పటికీ చెక్కు చెదరదని తెలిపారు. మిర్చియార్డు ఛైర్మన్ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ తన తల్లి పేరిట స్వగ్రామంలో గ్రంథాలయ నిర్మాణానికి సిద్ధమని తెలిపారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ మందపాటి శేషగిరిరావు, డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు,అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకష్ణ (ఆచారి), అంబేద్కర్, పార్టీ నేతలు గులాం రసూల్, పానుగంటి చైతన్య, ఆనం సంజీవరెడ్డి, గ్రంథాలయ సంస్థ డీడీ పీర్ అహ్మద్, ఏడీ దీక్షితులు, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, ఉప గ్రంథ పాలకురాలు కె.జాన్సీలక్ష్మి, ఎం.సీతారామయ్య, ఎస్.ఎమ్.సుభాని, నాగిరెడ్డి, చిన్నపరెడ్డి, దుర్గ, పూర్ణ, గుళ్ళపల్లి రాఘవేంద్రశర్మ పాల్గొన్నారు.**బృందావన్ గార్డెన్స్‌లో ..** స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని మహిళా బాలల శాఖ గ్రంథాలయంలో విజేతలకు బహుమతులు ప్రధానోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ బత్తుల దేవానంద్ , జిల్లా కార్యదర్శి చిన్నపాని శ్రీనివాస్‌రెడ్డిలు పాల్గొని మాట్లాడారు. గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ప్రతి ఆదివారం ఒక గంట అయిన గ్రంథాలయాలకు కేటాయించాలని అన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రంథాలయ అధికారి సిహెచ్ శ్రీనివాస్‌రావు, పి. కోటేశ్వరి, పి. సుధాకర్, లక్ష్మీలు పాల్గొన్నారు. **సత్తెనపల్లి :** స్థానిక వైయస్సార్ జిల్లా గ్రంథాలయంలో ముగింపు కార్యక్రమానికి సత్తెనపల్లి ఎంఇఓ ఏ శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు జరిగిన వివిధ రకాల పోటీలలో విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. **చిలకలూరిపేట :** చిలకలూరిపేట శాఖా గ్రంథాలయంలో ముగింపు ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా గోరంట్ల వేణుమాధవ్ పాల్గొని విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ పేర్ని కష్ణ మోహన, ఏ.గురులింగం, అలవాల ఫణి కుమార్, దార్ల బుజ్జిబాబు పాల్గొన్నారు.**తాడేపల్లి :** చిరిగిన చొక్కా అయినా తొడుక్కో ఓ మంచి పుస్తకం కొనుక్కో మహనీయుడు కందుకూరి వీరేశలింగం చెప్పిన సూక్తిని విద్యార్థులు ఆచరణలో పెట్టాలని వక్తలు పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సందర్భంగా తాడేపల్లి శాఖా గ్రంథాలయంలో గత ఏడు రోజుల నుండి జరిగిన వివిధ పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాగశేషు, మారుతి, శ్రీవల్లి, దుర్గాభవాని, హరిబాబు, నాగరాజు, గ్రంథాలయ అధికారి ఎస్‌కె.నాగూర్‌బాషా పాల్గొన్నారు. **తెనాలి:** గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా తెనాలిలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, ముగ్గులు వేయటం, కథలు చెప్పటం తదితర అంశాలపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు ముగింపు సభల్లో బహుమతులు అందించారు. పెదరావూరు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఎ.రాఘవేంద్రరావు అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రధానోతవంలో ముఖ్యఅతిథిగా గ్రామ సంర్పంచ్ కాకి రమాదేవి పాల్గొన్నారు. సంగం జాగర్లమూడి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి జె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగివ కార్యక్రమంలో సర్పంచ్ పాలడుగు జయనాగలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులకు బహుమతులు అందించారు. **తాడికొండ :** శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాల వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు జడ్పిటిసి గుడిమెట్ల జ్యోతి తదితరులు బహుమతులను ప్రధానం చేశారు. విజ్ఞప్తి చేశారు.

రొంపిచర్ల : మండలంలోని సంతగుడిపాడు, రొంపిచర్ల శాఖా గ్రంథాలయాల్లో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. విజేతలకు ముగింపు రోజు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన హిందీ పండిట్ నెమలిదిన్నె వెంకటేశ్వరరెడ్డిని గ్రామపెద్దలు, గ్రంథాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

పెదనందిపాడు: గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పెదనందిపాడు శాఖ గ్రంథాలయంలో ముగింపు సభ పెదనందిపాడు గ్రామ సర్పంచ్ దాసర పద్మారావు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు షేక్‌ఖాసింబి, ఎస్టియు గుంటూరు జిల్లా అధ్యక్షులు గేరా మోహన్ రావు, అశోక హైస్కూల్ డైరెక్టర్ పోపూరి లక్ష్మీనారాయణ ప్రసంగించారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. **ఈపూరు :** గ్రంథాలయాలలో పుస్తక పఠనం విద్యార్థులకు చదువుపై ఆసక్తిని పెంచుతుందని ఎంపీపీ ఈదర రాధిక అన్నారు. మండల కేంద్రమైన ఈపూరు శాఖ గ్రంథాలయంలో 55వ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు గ్రంథాలయ నిర్వాహకులు గంటా శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను ఎంపీపీ రాధిక, గ్రామ సర్పంచ్ చెంచయ్య అందజేశారు. **ప్రత్తిపాడు:** ప్రత్తిపాడు గ్రంథాలయంలో నిర్వహించిన ముగింపు ఉత్సవాల్లో గ్రంథాలయాధికారి బి. అరుణ, వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరెడ్డి ప్రసంగించారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలైన విద్యార్థులకు బహుమతులు, యోగ్యతా పత్రాలను అందించారు. ప్రజాప్రతిధులందరినీ గ్రంథాలయాధికారి శాలువాతో సత్కరించారు.

గుంటూరు

తాడేపల్లి

ప్రత్తిపాడు

సత్తెనపల్లి

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి, రాజుపాలెం

లారీ, ద్విచక్రవాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని రెడ్డిగూడెం వద్ద ఆదివారం చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చౌటపాపయపాలెం గ్రామానికి చెందిన కాకర్ల వెంకటరావు(23) వృత్తిరీత్యా పేరేచర్ల క్రషర్‌లో టిప్పర్ డ్రైవర్‌గా పనిచేసుకుంటు జీవం సాగిస్తున్నాడు. ఆదివారం పేరేచర్ల క్రషర్‌లో విధులు ముగించుకొని ద్విచర వాహనం పై చౌటపాపయపాలెం వస్తున్న క్రమంలో రెడ్డిగూడెం రైస్ మిల్లు వద్దకు వచ్చేసరికి పిడుగురాళ్ల వైపు నుండి వస్తున్న లారీ ఢీకొనడంతో వెంకటరావు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ఒక బాబు ఉన్నాడు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు.రాజుపాలెం ఎస్ఐ షఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మద్యం సీసాలు పట్టివేత

ప్రజాశక్తి- మేడికొండూరు

మండల కేంద్రమైన మేడికొండూరులో ఆదివారం రాత్రి అక్రమ మద్యాన్ని మేడికొండూరు ఎస్ఐ శ్రీనివాసరావు పట్టుకున్నారు. గ్రామానికి చెందిన ఆళ్ల గోపికృష్ణ మేడికొండూరులోని ప్రభుత్వ మద్యం షాపు నుండి 49 క్వార్టర్ సీసాలను అక్రమంగా విక్రయించేందుకు ద్వి చక్రవాహనంపై ఎన్టీఆర్ కాలనీకి తీసుకుని వెళుతుండగా పోలీసులు పట్టుకున్నారు.పోలీసులు కేసు నమోదు చేసి అతనిని అదుపులోకి తీసుకున్నారు.

యువకుడి అదృశ్యం

ప్రజాశక్తి -దుగ్గిరాల:తన కుమారుడు కనిపించడం లేదని తల్లి మేడికొండ రోజమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన మండల కేంద్రం దుగ్గిరాలలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మేడికొండ రోజమ్మ చిన్న కుమారుడు అశోక్ కుమార్ (35)ఆదివారం తెల్లవారు జాము నుండి కనిపించడం లేదు. ఉదయం తెల్లవారు జామున 4 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లినట్లు సీసీ కెమెరా ఫుటేజ్‌లో రికార్డై ఉంది. స్థానిక బాలికల హాస్టల్ ఎదురుగా ఉన్న డెల్టా కాలువ బకింగ్హామ్ కాలువ వద్ద అతని చెప్పులు ఉండటంతో కుటుంబ సభ్యులు కాలువ వెంట వెతికారు. అశోక్ కుమార్ హైదరాబాదులోని ఓ హోటల్లో పనిచేస్తూ అనారోగ్యం కారణంగా వారం రోజుల క్రితం ఇంటికి వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దుగ్గిరాల ఎస్సై ఏ శ్రీనివాసరెడ్డి కాలువ వద్ద చెప్పులున్న ప్రదేశాన్ని పరిశీలించి అతని ఇంటికి వచ్చి విచారణ జరిపారు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసి తహశీల్దార్ కే మల్లేశ్వకి విషయం తెలుపగా ఆమె ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాల కోసం కలెక్టర్ కార్యాలయానికి సమాచారం అందించినట్లు తెలిపారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని నింపిన వెంకట్రామయ్య

చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయుల, నాస్థిక సమాజ బృందం

ప్రజాశక్తి-తెనాలి

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పదాన్ని నింపి, ఎందరినో తీర్చిదిద్దిన ఉపాధ్యాయులు వెంకట్రా మయ్య అని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత పాలడుగు వెంకట్రామయ్య వర్ధంతి సభను స్థానిక కవిరాజాపార్కులోని విజికె భవన్‌లో నాస్తిక సమాజం ఆధ్వర్యంలో నిర్వహించారు. సభకు కొట్నీస్ ప్రజావైద్యశాల వైద్యులు డాక్టర్ భీమవరపు సాంబిరెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ అమృతలూరు, కొల్లూరు, పులివర్రు, నిడుబ్రోలు తదితర ప్రాంతాల్లో ఉపాధాయునిగా పనిచేసిన వెంకట్రావ్ ఎందరో విద్యార్థుల ఉన్నతికి బాటలు వేశారన్నారు. ప్రజాసాహితి సంపాదకులు కె.రవిబాబు, చందు నాగేశ్వరరావు, పొట్టి పోలేశ్వరరావు ప్రసంగించారు. కార్యక్రమంలో జె.శివకృష్ణ సభా పరిచయం చేయగా, సభలో కృష్ణకుమారి, జె.సత్యనారాయణ, కె.బెన్హర్ పాల్గొన్నారు. తొలుత వెంకట్రామయ్య చిత్రపటానికి పలువురు ఘనంగా నివాళులర్పించారు.

ఎమ్మెల్యే సుచరితకు సమస్యను తెలుపుతున్న మహిళలు

ఇల్లు కట్టించండమ్మా..

ప్రజాశక్తి- పెదనందిపాడు రూరల్

ఎండకు, వానకు ,చలికి చెట్ల కింద పిల్లలను పెట్టుకొని ఉండలేకపోతున్నాం అమ్మ మాకు ఇచ్చిన స్థలాలలో ఇల్లు కట్టించి మమ్మల్ని ఆదుకో అమ్మ అని పెదనందిపాడు నల్లమడ వాగు కట్టమీద పరదాపట్టలతో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న యానాదులు, మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు చెట్ల కింద నివాసం ఉంటున్న వారు ఎమ్మెల్యే సుచరితకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం సాయంత్రం గడపగడపకూ మన ప్రభుత్వం

కార్యక్రమంలో ఎమ్మెల్యేకు వారి గోడు వినిపించారు. రెండో దశలో పెదనందిపాడులో ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం చేపట్టి పేదలందరికీ న్యాయం చేస్తామని ఎమ్మెల్యే సుచరిత హామీ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలు సక్రంగా అందు తున్నాయా లేదా అని ప్రతి ఒక్కరిని అడిగి తెలుసుకున్నార. పత్తిపాడు మార్కెట్ యార్డు డైరెక్టర్ షేక్ ఖాసిం పీరా(మేస్త్రి) ఎంపీపీ హెప్సీబా, ఉప ఎంపీపీ లు ఖాసీం, సాంబశివరావు, సర్పంచి దాసరి పద్మారావు, సెక్రెటరీ బి శ్రీనివాసరావులు పాల్గొన్నారు

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, తెనాలి

O.S.No.301/2022

Between:

శ్యామల సుబ్బారెడ్డి వాది

మరియు

నగదేశి విజయలక్ష్మి, భర్త అంజయ్య
మెడికల్ అటెండెంట్, రైల్వే ఆసుపత్రి
ఆపోజిట్ రైల్వే స్టేషన్, విజయవాడ ప్రతివాదులు

పై నెంబరు దావాలో ప్రతివాది కోర్టు వారు పంపిన నోటీసులను తీసుకోనక తిప్పిపంపుచున్నందున, కోర్టు వారు ప్రతివాదిని పేపరు పబ్లికేషన్ ద్వారా నోటీసు ఆర్డరు వేసియున్నారు. కావున పై దావాలో ప్రతివాది ది.21.11. 2022న ఉదయం 10.30 గం.లకు పై కోర్టు నందు స్వయముగా కాని ప్లీడరు గారి ద్వారా కాని హాజరు కావలెను. లేని యెడల మాకు పరోక్షముగా దావా తీర్మానించబడును.

ఇట్లు

వాయిదా :21-11-2022

ఎస్.బి.శివ
వాది తరపు న్యాయవాది

సామాజికవేత్త విన్సెంట్ పాల్‌కు పురస్కారం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణానికి చెందిన సామాజికవేత్త చుక్క విన్సెంట్ పాల్ జాతీయ సాహిత్య రత్నా పురస్కారం లభించడంపై స్థానిక ప్రముఖులు పలువురు ఆయనను ఆదివారం అభినందించారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో లిటిల్ చాంప్స్ అకాడమీ ఆఫ్ ఇండియా నిర్వహించిన బాలల దినోత్సవ వారోత్స వాల్లో భాగంగా జాతీయ సాహిత్య రత్నా పురస్కారాన్ని ఆయ నకు అంద జేశారు. ప్రకాశం జిల్లా ట్రైనీ ఐఎఎస్ అధికారిణి హేళషారోన్ చేతుల మీదగా శనివారం ఒంగోలులో ఈ పురస్కారాన్ని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా చుక్కా విన్సెంట్ పాలు చేసిన సేవా, సాహిత్య కార్యక్రమాలను జరిగిన కార్యక్రమంలో వక్తలు ప్రశంసించారు.

ఓటర్ల స్వచ్ఛీకరణ కోసం ఆధార్ అనుసంధానం

ప్రజాశక్తి- రొంపిచర్ల

ఆధార్ కార్డుతో ఓటర్ కార్డును అనుసంధానం చేయించుకోవాలని గ్రామస్తులకు ఆర్డిఓ ఎం.శేషిరెడ్డి సూచించారు. మండలంలోని ఎలిమెంటరీ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఓటర్ల స్వచ్ఛీకరణ కోసం ఆధార్ అనుసంధానం చేయాలన్నారు. ఓటరుకు ఆధార్ కార్డు లింక్ చేయడం వల్ల డబుల్, త్రిబుల్ ఎంట్రీలకు ఆస్కారం ఉండదని చెప్పారు. బిఎల్ఓ లు వీఆర్వోల సూచనల మేరకు పోలింగ్ స్టేషన్‌లో పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటర్ నమోదు చేయిం చుకోవాలని సూచించారు. ఇప్పటికీ ఓటు నమోదు చేయించుకోని వారెవరైనా ఉంటే డిసెంబర్ 3,4 తేదీలలో బిఎల్వోలు, వీఆర్వో, పంచాయతి సెక్రటరీలు ఇంటింటికి తిరిగి సర్వే చేయాలని అన్నారు. పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు నమోదు చేయాలన్నారు. అలా నమోదు చేసుకున్న ఓటర్లను జనవరి 5న నూతన ఓటర్ల జాబితాలో చేర్చనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆర్.ఐ సుబ్బారావు వీఆర్ఓ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల వితరణ

ప్రజాశక్తి-వినుకొండ

ప్రతి నెలా ఆర్థికంగా వెనుక బడిన బ్రాహ్మణ కుటుంబాలను, బ్రాహ్మణ సేవా సమితి ఆదుకొనే దిశలో భాగంగా ఆదివారం జీవి. మాధవరావు కార్యాలయంనందు నిరు పేద కుటుంబాలకు బియ్యం, సరుకులు, దుప్పట్లు వితరణ జరిగినది.ప్రతి నెలా నిరుపేద కుటుంబమును ఆదు కుంటున్న చింతలచెర్వు రాఘవేంద్రరావు, భువనగిరి సుబ్ర హ్మణ్యం , నారాయణరావు, నారాయణం ఆనందా చార్యులు, చింతలపూడి వరద రాజగోపాలరావుల సహాయ సహకారాలతో నిరుపేద కుటుంబాలకు నిత్యావసర వస్తువుల వితరణ జరిగింది. చింతలపూడి భద్ర య్యను మెమంటో,శాలువా, పూల మాలతో సన్మానించారు.

రీసర్వేను పకడ్బందీగా నిర్వహించండి: కలెక్టర్

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

భూములు రీసర్వే ను పకడ్బందీగా నిర్వహించాలని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి తహశీల్దార్ కార్యాలయాన్ని ఆదివారం ఆయన తనిఖీ చేశారు. రీ సర్వే ప్రారం భం నుండి చివరి వరకు జరిగిన రికార్డులను తనిఖీ చేశారు. రీ సర్వే మ్యాపులు, ఆర్ఓఆర్ రికార్డులు, రైతులకు సర్వే చేసిన నోటీసులు, ఫారం 54లు పరిశీలించారు. రీ సర్వే నిబంధనలు పాటించారా లేదా అనే దానితో పాటు మొదలైన అంశాలపై వివ రాలు సేకరించారు. రెంటపాళ్ళలో 127 సర్వే నెంబర్లలో 490 మంది రైతులకు చెం దిన 890 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భూములను రీ సర్వే చేసినట్లు కలెక్టర్‌కు అధికారులు వివరించారు. అనంతరం రెంటపాళ్ళలో రీసర్వే సందర్భంగా ఏర్పాటు చేసిన హద్దు రాళ్ళను తనిఖీ చేశారు.

రీసర్వే రికార్డులను పరిశీలిస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్

సంక్రాంతి నాటికి భవన నిర్మాణం పూర్తి చేయాలి

అసంపూర్తిగా ఉన్న తహశీల్దార్ కార్యాలయం నూతన భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు.అధికారులకు పలు సూచనలు చేశారు. ఖాళీ ప్రదేశంలో మొక్కలు ఏర్పాటు చేయాలని తహశీల్దార్ కె.నగేష్ ను ఆదేశించారు. సంక్రాంతి నాటికి భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట పులిచింతల స్పెషల్ డెప్యూటీ కలెక్టర్, భూముల రీసర్వే ప్రత్యేక అధికారి వసంతబాబు, ల్యాండ్ సర్వే పల్నాడు జిల్లా ఏడి వై.నాగశేఖర్ ఉన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్
- ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలు చెల్లించండి
- 22న ఉమ్మడి జిల్లాల కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలు

ప్రజాశక్తి-నరసరావుపేట

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో వైసిపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్ ఆరోపించారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం యుటిఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 22న యుటిఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఉమ్మడి జిల్లాల కలెక్టరేట్ ల వద్ద సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా కార్యక్రమానికి పిలుపునిచ్చి న నేపథ్యంలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని, ఐక్యత చాటి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పి.ఎఫ్, ఏ.పి.జి.ఎల్.ఐ, డి.ఏ ఏరియర్లు, సరెండర్ లీవులు, మెడికల్ బిల్లులు దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను పీఆర్సీ చర్చలలో భాగంగా మార్చి నెలలో చెల్లిస్తామని ఇచ్చిన ప్రభుత్వ హామీలో పురోగతి లేదని విమర్శించారు.

ఉపాద్యాయుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరికి అవలంభిస్తోం దంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆదాయం బాగుందని ముఖ్యమంత్రి అం టూనే ఉపాధ్యాయులను మోసం చేయడం ఎందుకని ప్రశ్నించారు. యుటిఎఫ్ పల్నా డు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయ సారధి మాట్లాడుతూ పెండింగ్ బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ ఉద్యోగులు డి.ఏ ఎరి యర్స్‌కు సంబంధించి ఆదాయ పన్ను చెల్లించారని, అయినప్పటికి ఉద్యోగుల ఖాతాలకు చెల్లించలేదన్నారు. ఆర్థిక బకాయిల కోసమే ఆందోళన బాట పట్టామని ఉమ్మడి జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా నాయకులు కె.శ్రీనివాసరెడ్డి,ఎన్. సుందర రావు, ఎ.బాగే శ్వరీదేవి, జె.వాల్యా నాయక్, ఎమ్. మోహన్‌రావు, గఫార్, ఎ.శ్రీనివాస రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్ కుమార్

అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేటలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

ప్రజాశక్తి-అచ్చంపేట

అచ్చంపేట మండలంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆదివారం మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు విస్తృతంగా పర్యటిస్తూ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు అచ్చం పేట నుండి కోగంటివారి పాలెం వరకు రూ.2 కోట్లతో తారు రోడ్డు నిర్మాణానికి, చామరులో ఉపాధి హామీ నిధులు రూ.17.50 లక్షలతో ఆరోగ్య కేంద్రానికి, వేల్పూరు జడ్పిహెచ్ పాఠశాలలో రూ.24 లక్షలతో అదనపు తరగతి గదులు, బిసి కాలనీలో రూ.90 లక్షలతో జల జీవన మిషన్ ద్వారా ప్రతి ఇంటికి నీటి కుళాయిల పనులకు శంకుస్థాపనలు చేశారు. వీరభద్ర కాలనీలో రూ.8.30 లక్షల ఉపాధి హామీ నిధులతో బోరులు, జిఎల్ఆర్ వాటర్ ట్యాంకులు, చింతపల్లిలో రూ.40 లక్షల నిధులతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ప్రారంభించారు. జడ్పిటిసి తుమ్మ విజయ ప్రతాప్ రెడ్డి వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు నెల్లూరు చంద్రబాబు వైఎస్ఆర్సిపి అభిమానులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

ప్రసిద్ధ కవి కరీముల్లాకు ఘన సత్కారం

ప్రజాశక్తి-వినుకొండ

పట్టణానికి చెందిన ప్రసిద్ధ కవి కరీముల్లాకు మల్లెతీగ జాతీయ సాంస్కృతిక ఉత్సవాలలో భాగంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఘన సత్కారం జరి గింది. ఈ ఉత్సవాలలో మల్లెతీగ వ్యవస్థాపకులు కలిమిశ్రీ, కవి, జర్నలిస్టు బిక్కి కృష్ణ , సీనియర్ జర్నలిస్టు ఘంటా విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కరీముల్లా అబాబీలు అనే నూతన కవితా ప్రక్రియను సృష్టించిన గొప్ప కవి అని అభివర్ణించారు.కరీముల్లా కవిత్వం పేదప్రజల పక్షాన నిలబడి, ప్రజా కవిత్వంగా రూపొందిందని వక్తలు ప్రశంసించారు. తెలుగు సాహిత్య చరిత్రలో 'మన కాలం జాషువా'గా ప్రసిద్ధి చెంది వినుకొండ ఖ్యాతిని దశదిశలా చాటిన కవి అని ప్రశంసించారు. కరీముల్లా రూపొందించిన అబాబీలు ప్రక్రియను అనుసరిస్తూ ఇటు తెలుగు,కన్నడ భాషల్లో ఎంతోమంది కవులు తయా రయ్యారన్నారు. కరీముల్లా కవిత్వం దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా గళమెత్తుతూ, సామాన్య ప్రజల్లో చైతన్యాన్ని నింపుతూ ప్రేరణగా నిలిచిందని ప్రశంసించారు. అన్ని విశ్వవిద్యాలయాలు కరీముల్లా కవిత్వంపై పరిశోధనలు సాగిస్తున్నాయని కొనియాడారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలువురు కవులు, కళాకారులు కవి కరీముల్లాను అభినందించారు.

శాస్త్రీయ విజ్ఞానాభివృద్ధే దేశాభివృద్ధి

12వ రాష్ట్రస్థాయి అబ్దుల్ కలాం అవార్డుల ప్రదానోత్సవంలో వక్తలు

డాక్టర్ రామ్మోహనరావును సన్మానిస్తున్న వేణుగోపాల్, తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు : దేశ మూలాలలో దాగివున్న శాస్త్రీయ ఆలోచన విధానంతో వైజ్ఞానిక అభివద్ధి విద్యార్థులకు బోధించడం ద్వారా దేశం ప్రపంచానికి గురుస్థానంగా మారుతుందని హైదరాబాద్ నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ (ఎన్ఆర్ఎస్ఎ) శాస్త్రవేత్త డాక్టర్ కె.రామ్మోహనరావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య సమావేశ మందిరంలో డాక్టర్ చివుకుల హనుమంతరావు చారిటబుల్ ట్రస్ట్ సిబిన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ హైదరాబాద్ (తెలంగాణ), సుగుణ సైన్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో 12వ రాష్ట్రస్థాయి అబ్దుల్ కలాం అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన విద్యావేత్త బి.మల్లికార్జునరావు మాట్లాడుతూ వ్యక్తిగా, శాస్త్రవేత్తగా, భారత రాష్ట్రపతిగా వెలుగొందిన డాక్టర్ అబ్దుల్ కలాం గుణగణాల స్ఫూర్తితో ఉపాధ్యాయులు, విద్యార్థులు రాణించాలని కోరారు. డాక్టర్ చివుకుల హనుమంతరావు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు వ్యవస్థాపక అధ్యక్షులు సాంబశివరావు మాట్లాడుతూ గత 12 ఏళ్ళుగా సేవా సంస్థలు, దాతల సహకారంతో పురస్కారాలు అందజేస్తున్నట్లు వివరించారు ఈ సందర్భంగా 15 మందికి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విజ్ఞాన్ గురు పురస్కారాలు, 12 మందికి గురు పురస్కార్ అవార్డులు, 16 మందికి ఇన్స్పిరేషన్ అవార్డులు, 7గురికి అబ్దుల్ కలాం సేవ పురస్కార్ అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు కార్యదర్శి పత్రి వేణుగోపాల్, డాక్టర్ కప్పగంతు రామకృష్ణ, కళ్యాణం వెంకటరమణ, డాక్టర్ సిహెచ్ నాగేశ్వరరావు, డాక్టర్ షణ్ముఖ కుమార్, గుంటూరు జిల్లా సైన్స్ ఆఫీసర్ రాయపాటి శివ నాగేశ్వరరావు, పల్నాడు జిల్లా సైన్స్ ఆఫీసర్ ఏఏ మధు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ వెంకట నాయుడు

కిడ్నీ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-గుంటూరు

కిడ్నీ మూత్ర సంబంధిత వ్యాధులైన కిడ్నిలో రాళ్ళు, కిడ్నీ ఇన్ఫెక్షన్, కిడ్నీ కేన్సర్, మూత్ర విసర్జన సమస్యలు, ప్రొస్టేటు గ్రంధి పెరగటం లాంటి సమస్యల పట్ల నిర్లక్ష్యం తగదని, వెంటనే వైద్యుడిని సంప్రదించాలని గుంటూరు కిడ్నీ అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఎండి, ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ వి.వెంకటనాయుడు అన్నారు. ఆదివారం అరండల్‌పేట, అవగాహన కార్యాలయంలో నిర్వహించిన ఆరోగ్య సభలో డాక్టర్ వెంకట నాయుడు మాట్లాడుతూ మూత్రాన్ని తయారు చేసి, నిల్వ చేసి, విసర్జించే ప్రక్రియలను నిర్వహించే భాగాలైన మూత్ర వ్యవస్థ గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, వయస్సు మీద పడుతున్న కొద్దీ, కిడ్నీల నిర్మాణంలో మార్పులు వస్తుంటాయన్నారు. రక్తంలో మలినాలను తొలగించటంలో అవి కాలక్రమంలో కొంత సామర్థ్యాన్ని కోల్పోతాయన్నారు. కిడ్నీలలో రాళ్ళు ఏర్పడటం ఎక్కువ మందిలో జరుగుతుందని, ప్రొస్టేటు గ్రంధి వాయటం, మూత్రంలో ప్రొటీన్లు అధికంగా పోవటం, కిడ్నీలు పనిచేయకోవటం, మూత్ర వ్యవస్థ ఇన్ఫెక్షన్లు, మూత్రాన్ని ఆపుకోలేకపోవటం లాంటి సమస్యలు వృద్ధులు ఎక్కువగా ఎదుర్కొంటున్నారని వివరించారు. ఇన్ఫెక్షన్ల కారణంగా, నొప్పులకు వాడే మందులు, బిపి, షుగర్ వ్యాధులు కిడ్నీ మూత్ర సంబంధిత వ్యాధులకు కారణాలని నిర్లక్ష్యం చేస్తే అనర్థాలు తప్పవని, జీవనశైలిలో మార్పులు, ఆహార నియమాలు పాటిస్తూ ఉండాలన్నారు. అనంతరం డాక్టర్ వెంకటనాయుడుని అవగాహన సభ్యులు సన్మానించారు.

వేలాది మందిని రోడ్డున పడేస్తున్న కంపెనీలు

ప్రజాశక్తి-గుంటూరు

ఖర్చు తగ్గించుకుకోవటానికి రాత్రికి రాత్రే వేలాది ఉద్యోగాలు తీసి పారేస్తున్న ట్విట్టర్, మెటా, అమెజాన్ వంటి కార్పోరేట్ సంస్థలు వేలాది మందిని రోడ్డున పడేస్తూ భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నాయని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కనీసం ప్రశ్నించే హక్కుగానీ, నిలదీసే వాతావరణంగానీ మచ్చుకైనా లేకపోవడం విషాదమని అన్నారు. ఈ సంస్థల నిర్ణయాలు వాటికి మాత్రమే పరిమితమని అనుకునేందుకు వీలు లేదని, సమాజం మీద చూపే ప్రభావం తక్కువేమీ కాదన్నారు. అటువంటి దిగ్గజ కంపెనీలు వరుస పెట్టి ఉద్యోగాలు తీసివేస్తున్నప్పుడు ఒక దానిలో పోతే మరోటి అన్న కనీస భరోసా కూడా కోల్పోయి యువత నిరాశ, నిస్పృహాల్లోకి జారుకుంటుందని పేర్కొన్నారు. కార్పొరేట్ కంపెనీల ఈ తరహా వైఖరితో ఉపాధిలో అనిశ్చితి ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ గుత్త సంస్థలు అవతరించడానికి కారణమైన ప్రభుత్వాలు ప్రశ్నించలేని స్థితిలో నేడు ఉన్నాయని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు, బహుళ జాతి కంపెనీలకు భారీ నజరానాలతో ఎర్ర తివాచీలు పరిచే పాలకులు ఇలా వేల సంఖ్యలో ఉద్యోగాలు పోతున్న సందర్భాలలోనైనా కదలాలని, ప్రభుత్వాలు, న్యాయస్థానాలు జోక్యం చేసుకోవాలని, చట్టాలను బలంగా అమలు చేస్తే తప్ప ఈ ఏకపక్షధోరనికి అడ్డుకట్ట పడదని డిమాండ్ చేశారు.

ఎడిటర్స్, రిపోర్టర్స్ యూనియన్

రాష్ట్ర గౌరవసలహాదారుగా బాలాజిరెడ్డి

ప్రజాశక్తి - తాడేపల్లి

ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్‌రిపోర్టర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ సలహాదారుగా ఉండవల్లికి చెందిన ప్రముఖ విద్యావేత్త దంటు బాలాజిరెడ్డి ఎంపికయ్యారు. ఉండవల్లి గుహల వద్ద యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం అనంతరం ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఈసందర్భంగా బాలాజిరెడ్డి మాట్లాడుతూ పాత్రికేయులు మరియు పత్రికా సంపాదకుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి జర్నలిస్టుల అభివృద్ధికి కృషిచేస్తానని హామీనిచ్చారు. పత్రికా నిర్వహణ కష్టసాధ్యంగా ఉన్న ఈ సమయంలో ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పత్రికలు నడపడం ముదావహమని కొనియాడారు. ఈ సందర్భంగా బాలాజిరెడ్డిని రాష్ట్ర నాయకులు సత్కరించి జ్ఞాపికను అందజేశారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సాంబశివ నాయుడు, గౌరవాధ్యక్షులు ఎ.నారాయణమూర్తి, రాష్ట్ర ప్రధాన న్యాయసలహాదారు నరహరిశెట్టి శ్రీహరి పాల్గొన్నారు.

బాలాజిరెడ్డికి నియామకపత్రాలు అందజేస్తున్న యూనియన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

తీవ్ర సంక్షోభంలో కౌలు రైతులు

పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో నేడు, రేపు కౌలు రైతు సంఘం రాష్ట్ర మహాసభ

వై.రాధాకృష్ణ, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు

రాష్ట్రంలో 55శాతం జనాభా ఇప్పటికీ వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. 40శాతం మందికి సెంటు భూమి లేదు. రాష్ట్రంలో సాగుభూమి జీవనోపాధి వనరుగాకాక, పూర్తిగా అమ్మకపు సరుకుగా మారిపోయింది. సాగులో లేని వాడే భూములను కొనుగోలు చేస్తున్నారు. రాష్ట్రంలో 45శాతం కౌలు రైతులు ఉన్నారు. దేశంలోనే కౌలు రైతులలో మన రాష్ట్రం మొదటి స్థానంలో ఉంది. సాగు రైతులలో కీలకంగా ఉన్న ఈ కౌలు రైతులను గుర్తించి వారికి ప్రభుత్వ పథకాలను అమలు చేయడంలో పాలకులు విఫలమయ్యారు. ఈ మూడు సంవత్సరాల కాలంలో 300 మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ రైతుల ఆత్మహత్యల్లో 80శాతం కౌలు రైతులవే.

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత 2011లో తెచ్చిన భూ అధీకృత సాగుదారుల చట్టం రద్దు చేసి, 2019లో పంట సాగుదారుల హక్కు చట్టం తెచ్చింది. ఈ చట్టంలో భూ యజమాని అంగీకార పత్రం ఇవ్వాలని, కౌలు గుర్తింపు కార్డు పంట సాగు హక్కు పత్రం (సిసిఆర్‌సి)పై భూ యజమాని సంతకం చేయాలని చట్టంలో పేర్కొనడం ద్వారా కౌలు రైతులకు భూ యజమానులు అంగీకార పత్రాలను ఇవ్వనిరాకరిస్తున్నారు. భూ యజమని ఇష్టానుసారం మంజూరు చేయడం ద్వారా రాష్ట్రంలో 30శాతం పైగా బోగస్ కార్డులు మంజూరు అయ్యాయి. సిసిఆర్‌సి కార్డులమీద భూ యజమాని, విఆర్ఒ, కౌలు రైతు ముగ్గురి సంతకాలు ఉండాలి. కాని కౌలు రైతు సంతకం లేకుండానే భూ యజమాని సంతకంతో కార్డులు మంజూరు అయినాయి. కొన్నిచోట్ల బినామీ పేర్లతో కార్డులు ఇచ్చారు. భూమిలేని ఎస్.సి, ఎస్.టి.బి.సి., మైనార్టీలకు మాత్రమే రైతు భరోసా రూ.13500 ఇస్తామని ప్రభుత్వం చెప్తున్నా వాస్తవానికి వారు సాగులో ఉన్నా, కార్డులు లేక రైతు భరోసా పొందటం లేదు. భూ యజమాని సంతకం చేయాలని చెప్పడం ద్వారా చాలా మంది కౌలు రైతులు దర ఖాస్తు చేసుకోడానికి కూడా ముందుకు రావ డం లేదు.

ప్రభుత్వం రైతులకు అందిస్తున్న కొద్దిపాటి సబ్సిడీలు కూడా కౌలు రైతుకు అందడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రైతు భరోసా, ప్రకృతి వైపరీత్యాల ద్వారా నష్టపోయిన పంటకు ఇన్‌పుట్స్ రూపంలో ఇచ్చే నష్టపరిహారాలు, పంటల బీమా పరిహారం, వడ్డీలేని పంట రుణాలు, చివరకు పండించిన పంటను అమ్ముకోవాలన్నా గుర్తింపుకార్డు లేక భూ యజమాని పేరుతోనే అమ్ముకోవలసి వస్తుంది. లేదా తక్కువ ధరకు ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకుంటున్నారు. పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వడం ద్వారానే కౌలు రైతులకు న్యాయం జరుగుతుంది. పండిన పంటను అమ్ముకునే సమయంలో కనీస మద్దతు ధరపై రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇచ్చి కొనుగోలు చేయాలి. ఈ పరిహారం నేరుగా కౌలు రైతులకు అందేందుకు అవకాశం ఉంటుంది.

దేశానికి ఆదర్శం కేరళ

కేరళ రాష్ట్ర ప్రభుత్వం క్వింటా వరి ధాన్యం కనీస మద్దతు ధర రూ.2060 అయితే మరో రూ.800 బోనస్ కలిసి రూ. 2860లకు కొనుగోలు చేసి ఆ రాష్ట్ర రైతాంగాన్ని ఆదుకుం టుంది. ఇక్కడి ప్రభుత్వాలు భూమి ఆధారంగా పథకాలను అమలు చేస్తూ కొద్దిపాటి సబ్సిడి కూడా కౌలు రైతులకు రాకుండా భూయజమానులే అనుభవిస్తున్నారు.

రైతు భరోసా కేంద్రాలు..

ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన రైతు భరోసా కేంద్రాలు కూడా కౌలు రైతులకు ఏ మాత్రం ఉపయోగకరంగా లేవు. విత్తనం నుంచి విక్రయాల వరకు సేవలందించిస్తామన్న ఆర్‌బికెల్లో కూడా కౌలు రైతులకు ఈ-క్రాప్ నమోదు, ఈ-కెవైసి చేయడం లేదు. సకాలంలో విత్తనాలు అందుబాటులో ఉండవు. దాన్యం అమ్ముకోవడానికి నెలలపాటు ఎదురు చూడాలి. దాన్యం అమ్ముతున్నా డబ్బులు కూడా సకాలంలో రైతులకు అందడం లేదు. కేంద్రప్రభుత్వం ఎరువులపై ఇచ్చే సబ్సిడీలను తగ్గిస్తూ, ఎప్పటికప్పుడు ధరలను పెంచుతుంది. ఫర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను ప్రైవేటీకరించే ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఎరువులు, పురుగుమందులు, ఇతర వ్యవసాయ యంత్రపనిముట్లపై జిఎస్టి విధిస్తూ రైతులపై మోయలేని భారాన్ని మోపుతుంది. మొత్తం విద్యుత్ రంగాన్ని ప్రైవేటుపరం చేసే లక్ష్యంతో విద్యుత్ సవరణ బిల్లు 2020 తెచ్చింది. వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు బిగించాలని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. కేంద్రప్రభుత్వ ఒత్తిడికి లొంగి రాష్ట్ర ప్రభుత్వం రూ.6,500 కోట్లు ఖర్చు పెట్టి పంపు సెట్లకు స్మాట్ మీటర్లు బిగిస్తుంది. రానున్న కాలంలో నీటిని కూడా కొనుగోలు చేసి పంటలు పండించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

కళామందిర్ సెంటర్‌లో బహిరంగసభ

సమస్యలమయంలో ఉన్న రైతులను కాపాడుకొనుటకు, వ్యవసాయాన్ని రక్షించేందుకు, కౌలు రైతుల సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం తృతీయ రాష్ట్ర మహాసభలు నవంబర్ 21,22 తేదీలలో పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో జరుగుతున్నాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 300కు పైగా కౌలు రైతుల ప్రతినిధులు ఈ సభలో పాల్గొంటారు. కౌలు రైతుల సమస్యలను చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకోవడం జరుగుతుంది. ఈ సభలను అఖిల భారత కిసాన్ సభ జాతీయ సహాయ కార్యదర్శి విజ్జూ కృష్ణన్ ప్రారంభిస్తారు. సాయంత్రం 5 గంటలకు కళామందిర్ సెంటర్‌లో బహిరంగసభ జరుగుతుంది. ఈ సభలో రైతులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

డిమాండ్స్...

1. గ్రామ సచివాలయం, రెవెన్యూ వ్యవస్థ ద్వారా భూయజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలు రైతులను ప్రభుత్వం గుర్తించాలి.

2. ఈ-క్రాప్‌లో కౌలు రైతుల పేర్లు నమోదు చేసి, వారి పేరుతోనే ఈ-కెవైసి చేయాలి.

3. రైతు భరోసా, పంట రుణాలు, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీలు కౌలురైతులకు ఇవ్వాలి.

4.కనీస మద్దతు ధరలకు అదనంగా బోనస్ ఇచ్చి ప్రభుత్వం కొనుగోలు చేయాలి.

5. భూమి లేని కౌలు రైతులకు రైతు భరోసా 30 వేలు ఇవ్వాలి.

6.వ్యవసాయ ఉపకరణాలు, యంత్రాలపై జిఎస్టి రద్దు చేయాలి.

7. కౌలు రైతులకు రుణ విముక్తి కల్పించాలి.

8. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

మూడేళ్లల్లోనే ఎనిమిది కోట్ల రుణాలిచ్చాం

నూజెండ్ల-ప్రజాశక్తి

సొసైటీ వారోత్సవాల్లో భాగంగా చివరి రోజు ఆదివారం నూజెండ్ల పిఎసిఎస్ కార్యాలయం వద్ద జెండా వందనం చేశారు. సొసైటీలో రైతులకు అందించే సేవల గురించి నూజెండ్ల సొసైటీ చైర్ పర్సన్ పి.పిచ్చిరెడ్డి వివ రించారు. పిచ్చిరెడ్డి మాట్లాడుతూ సొసైటీ ఏర్పడినప్పటి నుంచి 2019 వరకు కూడా మొత్తం ఏడు కోట్ల రుణాలు రైతులకు ఇచ్చారని, వైసిపి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ మూడేళ్లల్లోనే సొసైటీలో ఎనిమిది కోట్ల రుణాలు రైతులకు ఇవ్వడం జరిగిందన్నారు. రైతులకు అధిక మొత్తంలో తక్కువ వడ్డీలకు రుణాలు ఇవ్వడంమే గాక రైతుల పంటను స్టాకు ఉం చేందుకు మార్కెటింగ్ గూడెంలు నూజెండ్ల సొసైటీ పరిధిలోని రవ్వవరం, ముప్పరాజువారి పాలెం, పువ్వాడ, వి.అప్పాపురం, గ్రామ పంచాయతీల్లో మార్కె టింగ్ గూడెం పనులు త్వరలో ప్రారంభించి రైతులకు అందు బాటులో తీసుకురానట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి మేడమ్ జయ రామిరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ జి.బాలి రెడ్డి, మండల వైసిపి కన్వీనర్ ఎన్. నాగిరెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు జె.రామయ్య, వి.ప్రసాద్, ఎం.అంజిరెడ్డి, జి.నాగార్జునరెడ్డి, సొసైటీ సీఈఓ జి.శ్రీనివాసరావు ఉన్నారు.

నియోజకవర్గ బిఎస్పీ ప్రధాన కార్యదర్శిగా కస్తూరి

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన గుజ్జర్లపుడి కస్తూరి నియమితులైనట్లు ఆ పార్టీ నియోజక వర్గ అధ్యక్షులు బొక్క సంగీతరావు ఆది వారం తెలిపారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్య కర్తల సమావేశంలో కస్తూరికి పార్టీ కండువా కప్పి ఆహ్వా నించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆమెను అభినందించారు. కస్తూరి మాట్లాడుతూ నియోజకవర్గంలో బిఎస్పి అభివృద్ధికి శాయశక్తులా కషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షులు డాక్టర్ ఎ.ఎన్.ఆర్ జక్కం, న్యాయవాది బి. తిరుపతయ్య, ఆర్. అంబేడ్కర్ పాల్గొన్నారు .

నియోజకవర్గంలో ఏమి అభివృద్ధి చేశారు?

ప్రజాశక్తి- కారెంపూడి

అవినీతి, అక్రమాల గురించి మాట్లాడే అర్హత వైసిపి నాయకులకు లేదని టిడిపి సీనియర్ నాయకుడు పంగులూరి అంజయ్య అన్నారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికలలో అధికారంలోకి వచ్చేది టిడిపి ప్రభుత్వమేనని జోస్యం చెప్పారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన పిన్నెల్లి రామ కృష్ణారెడ్డి నియోజకవర్గంలో ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. పదవులకు రాజీనామా చేసి స్వచ్ఛందంగా ఎన్నికలకు రావాలని, ప్రజలు ఎవరికి పట్టం కడతారో చూద్దామని అన్నారు. చిలకలూరిపేట,మాచర్ల వినుకొండ దాచేపల్లిలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయ న్నారు. టిడిపి హయంలో వైసీపీ నాయకులు చాలా లబ్ది పొందారన్నారు. టిడిపి నాయకులపై చేసిన అవినీతి ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. బహిరంగ చర్చకు వైసిపి నాయకులు సిద్ధమా అంటూ అంజయ్య సవాల్ విసిరారు.

ఐదు నెలలుగా నిత్యవసరాల్లో కోత!

ప్రజాశక్తి -అమరావతి

అమరావతి మండల పరిధిలోని రేషన్ దుకాణాల్లో అందించాల్సిన కందిపప్పు, పంచదార ఐదు నెలలుగా కార్డు దారులకు అందడం లేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఒకపక్క నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతుంటే సబ్సిడీలో రేషన్ సరుకుల ద్వారా అందించాల్సిన కిలో కందిపప్పు, అరకిలో పంచదార కూడా రాష్ట్ర ప్రభుత్వం ఐదు మాసాలుగా నిలిపివేసిందని ప్రజలు విమర్శిస్తున్నారు. రేషన్ దుకాణాల్లో ఇవ్వాల్సిన నిత్యావసరాలపై ఒక్కొక్క దానిపై కోత విధిస్తూ, బియ్యం మాత్రమే ఇచ్చి సరిపెట్టుకుంటున్నారని అంటున్నారు. ఒకప్పుడు రేషన్ దుకాణాల్లో పేదలకు సబ్సిడీగా కార్డుదారులకి పామాయిల్, గోధుమలు, పంచదార, కందిపప్పు, సాల్ట్ ప్యాకెట్టు ఇలా అనేక రకాల నిత్యావసరాలను సబ్సిడీ ధరలకే కార్డుదారులకు అందించేవారు. నేడు అధికార ప్రభుత్వం ఒక్కొక్క వ్యక్తికి ఐదు కిలోల బియ్యం ఇస్తూ గత ఐదు మాసాలుగా ఒక కిలో కందిపప్పు అరకిలో పంచదార కూడా కార్డుదారులకు ఇవ్వలేక పోతోంది. తద్వారా కార్డుదారుడికి రెండు నుంచి మూడు వందల వరకు నెలకు సబ్సిడీ కోల్పోతున్నాడు. పంటలు లేక వ్యవసాయ పనులు తగ్గి, కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిన ప్రజలకు కొంతమేరకైనా నిత్యవసర సరుకులు, రేషన్ దుకాణాల ద్వారా అందిస్తే భారం కొద్దిగా అయినా తగ్గుతుందని కార్డుదారులు కోరుతున్నారు ఇప్పటికైనా ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా అందించే కందిపప్పు, పంచదారతో పాటు గతంలో లాగా పామాయిల్, గోధుమపిండి, సాల్ట్ ప్యాకెట్ మరికొన్ని నిత్యవసరాలు ఇవ్వడం ద్వారా ప్రజలకు కొంత మేలు జరుగుతుందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై ప్రత్యేకమైన దృష్టి సారించాలని జిల్లా ఎస్పి ఆరీఫ్ హఫీజ్ ఆదే శించారు. ఇందుకోసం ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వ హించారు. మేడికొండురు, తెనాలి, పొన్నూరు, మంగళగిరి,తాడేపల్లి చేబ్రోలు , పత్తిపాడు,గుంటూరు టౌన్, నల్లపాడు మద్యం సేవించి ప్రజలకు ఇబ్బంది కల్గిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ నిర్వహించారు. కొంత మందిపై కేసులు నమోదు చేశారు. శాంతికి భంగం కల్గిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

చంద్రబాబుపై ఆరోపణలు తగదు : చదలవాడ

ప్రజాశక్తి-నరసరావుపేట

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును విమర్శించే అర్హత స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి లేదని నరసరావు పేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన టిడిపి జాతీయ అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై ఆరోపణలు చేయడం తగదన్నారు. కనీసం చంద్రబాబు వయసుకు కూడా విలువ ఇవ్వకుండా మాట్లాడటం తగదన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్న సమయంలో జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రకు సెక్యూరిటీ కల్పించిన విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. మోసపూరిత వాగ్దా నాలతో అధికారంలోకి వచ్చిన జగన్ ఆంధ్ర రాష్ట్రాన్ని నిలువునా దోచుకుంటున్నారని, రాష్ట్రం దివాళా తీసిందని విమర్శించారు. చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని అన్నారు.

వైసిపి పాలనలో యువతకు అన్యాయం

ప్రజాశక్తి - కారెంపూడి

వైసిపి ప్రభుత్వంలో యువతకు ఉపాధి లేక నిరు ద్యోగులకు ఉద్యోగాలు లేక వలసలు వెళ్ళటం, ఆత్మహత్యలకు పాల్పడటం జరుగుతోందని తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి గోళ్ల సురేష్ యాదవ్ విమర్శించారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ మూడున్నరేళ్లలో నిరుద్యోగులకు నోటిఫికేషన్ లేక కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాలు రాక యువత తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తెలుగు యువత ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిర సన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.ఎస్సీ, ఎస్టీ,బీసీ మైనారిటీ కాపు కార్పొరేషన్ల నిధులు వైసిపి ప్రభుత్వం నిరుప యోగంగా చేసిందన్నారు. కార్పొరేషన్ నిధులు వేల కోట్ల రూపాయలు దారి మళ్లించారని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా నోటిఫికేషన్ విడుదల చేసి నిరుద్యోగులకు ఉద్యోగాలు కార్పొరేషన్ల ద్వారా నిధులు కేటాయించాలని కోరారు. సమావేశంలో తెలుగు యువత టి.రత్తయ్య, బి. హరికృష్ణ, బి. హరికృష్ణ, నాగుల్ మీరా,శ్రీను, జానీ బాషా పాల్గొన్నారు.

తండ్రి ఆశయాలను కొనసాగిస్తా : కోడెల శివరాం

ప్రజాశక్తి-ముప్పాళ్ల

ఆకలి అన్నవారికి పట్టెడన్నం పెట్టాలనే నా తండ్రి ఆశయాలను కొనసాగించడమే తన లక్ష్యమని సత్తెనపల్లి తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ నాయకులు యువనేత డాక్టర్ కోడెల శివరాం అన్నారు. డాక్టర్ కోడెల శివప్రసాద రావు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని ఇరుకు పాలెం నుండి నర్సారావుపేట ఇస్సపాలెం అమ్మవారి దేవాలయం వరకు జరిగిన చంద్రన్న ఆశయ సాధన యాత్రలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యకర్తల అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. శివరాం మాట్లాడుతూ ప్రతి పేదవాడు కడుపునిండాలనే ఉదేశ్యంతో కోడెల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గత కొన్ని నెలలుగా మొబైల్ అన్నా క్యాంటీన్ ద్వారా అన్నదాన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. పేదవాని కడుపు నింపే మహత్తర కార్యమే అన్నా క్యాంటీన్ అని అటువంటి మంచి కార్యక్రమాన్ని కూడా రాజకీయ కోణంలో చూసిన జగన్ రెడ్డి రాష్ట్రంలో టిడిపి హయాంలో ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్లు మూసివేయడం సిగ్గుచేటన్నారు. కార్తీక మాసం సందర్భంగా యాత్రలో పాల్గొన్న కార్యకర్తలకు ఆలయానికి విచ్చేసిన భక్తులకు గ్రామంలో నిరుపేదలకు,రైతు కూలీలకు, చిన్నారులకు శివరాం స్వయంగా వడ్డించారు. గ్రామస్థులతో కలిసిసహపంక్తి భోజనం చేశారు. టిడిపి ముప్పాళ్ల మండల నాయకులు నలబోతు పాపారావ తదితరులు పాల్గొన్నారు.

నమ్ముకున్న వారికి అండగా ఉండాలి

ప్రజాశక్తి - రాజుపాలెం

వన సమారాధనలో మాట్లాడుతున్న మంత్రి అంబటి

మనం నమ్ముకున్న వారికి మనం నమ్మకంగా ఉంటూనే... మనల్ని నమ్ముకున్న వారికి కూడా మనం అండగా ఉండటమే ముఖ్యమని వైసిపి సీనియర్ నాయకులు, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం రాజుపాలెంలోని మామిడి తోటలో జరిగిన నియోజకవర్గ కాపు వన సమారాధన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమ్మారెడ్డి మాటాడుతూ అన్ని రంగాల్లోనూ కాపులు ముందుండాలని, విద్యా పరంగా చైతన్యం కావాల్సిన అవసరం ఉంద న్నారు. తమ ప్రాంతంలో పేద కాపులకు విద్యా చేయూతను అందిస్తున్నామని, వృద్ధులకు ఆశ్రమం నెలకొల్పే ఆలోచన ఉందన్నారు.

రాష్ట్ర జలవనుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ పవిత్ర భావంతో, రాజకీయాలకు అతీతంగా ఈ వన సమారాధన నిర్వహిస్తున్నా మన్నారు. ప్రతినిత్యం యాంత్రికంగా సాగు తున్న జీవనానికి ఇలాంటి పార్టీల కతీతమైన సమావేశాలు కుల బంధాన్ని మెరుగు పరుస్తాయన్నారు. అందరినీ కలుపుకుపోతూ కులానికి ప్రాధాన్యత నిస్తానన్నారు.వైసిపికి సర్వ సైన్యాధ్యక్షుడిగా అవసరమైన చోట తప్పకుండా సద్విమర్శలు చేస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. తమ పల్లె రేపల్లె కాదని సత్తెనపల్లి అని, పునర్జీవనం అందించిందని,మర్చిపోనని చెప్పారు. ఇతర ప్రముఖులు శనక్కాయల అరుణ, తులసి రామచంద్ర ప్రభు, పక్కాల సూరిబాబు తదితరులు మాట్లాడారు. కాపుల ఐక్యత, రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఇతర అంశాల గురించి మాట్లాడారు. రాజు పాలెం మండల కన్వీనర్ ఏపూరి శ్రీనివాసరావు కార్యక్రమాన్ని నిర్వహించారు కార్యక్రమంలో రాజుపాలెం సర్పంచ్ పులి బండ్ల అశోక్, ముప్పాళ్ళ జెడ్పిటిసి సిరిగిరి చంద్రకళ, ఆకుల శివయ్య , సదనం సత్యవతి,గోపు అప్పమ్మ ,వెంపా జ్వాలా నరసింహారావు,లేళ్ళ వెంకటరావు, పలు గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు,మహిళలు ఉన్నారు.

రైతులను ముంచిన ఆన్‌లైన్ విత్తనాలు

- ఎకరాకు10 బస్తాల చొప్పున తగ్గిన దిగుబడి
- ఆందోళన వ్యక్తం చేస్తున్న బాధిత రైతులు

మూడు ఎకరాలలో నూర్పిడి చేసిన ధాన్యం

లారీకి లోడ్ చేసిన ధాన్యం బస్తాలు

మాగులూరి కృష్ణమూర్తి

ప్రజాశక్తి-దుగ్గిరాల

యూట్యూబ్‌లో వచ్చే ప్రచారం చూసి వరిలో నాసిరకం వంగడాలను సాగు చేసి రైతులు తీవ్రంగా నష్టపోయిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎకరానికి 40 బస్తాలు సాగు చేసే భూమిలో 30 బస్తాలకు దిగుబడి రావడంతో బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే .. నెల్లూరు జిల్లాకు చెందిన ఒక రైతు యూట్యూబ్‌లో 125 రోజుల పంట అని, దోమకాటు ఉండదు,వర్షానికి గాలికి పైరు పండుతుందని పచారం చేశారు. దీంతో మండలంలోని ఈమని గ్రామానికి చెందిన రైతులు 1638 రకం వరి ధాన్యాలు ఆన్లైన్ ద్వారా తెప్పించుకొని సాగు చేశారు. అయితే 125 రోజులకు ముందే పంట చేతికి వచ్చింది కాని దిగుబడి తీవ్రంగా తగ్గింది.. ఒకరికి 28 బస్తాలు, మరొకరికి 35 బస్తాలు దిగుబడి వచ్చాయి. మాగులూరి కృష్ణమూర్తి అనే రైతు మూడు ఎకరాలు నూర్పిడి చేయగా 30వస్తాలు కాడికి దిగుబడి వచ్చింది. దీంతో ఆ రైతు యూట్యూబ్‌లో ప్రచారం చేసిన రైతుతో చరవాణిలో మాట్లాడారు. మీరు పాత విత్తనాలు వాడి ఉంటారు అందువల్ల దిగుబడి తగ్గిందని ఆయన సమాధానమిచ్చినట్లు తెలిపారు. దీంతో ఆన్‌లైన్‌లో విత్తనాలు నమ్మి తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు.అధికారులు ఇలాంటి తప్పుడు ప్రచారం చేస్తూ, నకిలీ విత్తనాలు అమ్మే వారి చర్యలు తీసుకోవాలని కోరుతున్న ట్లు రైతులు తెలిపారు.

ఆశాజనకంగా ధరలు

ప్రస్తుతం వాతావరణ అనుకూలతను బట్టి బిబిటి రకాలు ఎకరానికి 40 బస్తాలు వరకు సాగు ఆయ్యే అవకాశాలు ఉన్నాయని, ధరలు కూడా గత ఏడాది ఖరీఫ్‌తో పోల్చుకుంటే ఈ ఏడాది ఆశాజనకంగానే ఉన్నాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది 77 కేజీల బస్తా రూ.900 నుండి రూ.1000 రూపాయలకు వ్యాపారస్తులు కళ్ళల్లోనే కొనుగోలు చేశారు. ప్రస్తుతం 1638 సన్నరకం రూ.1280 లకు కొనుగోలు చేస్తున్నారు. బిబిటి రకం దాన్యం కళ్ళలోనే రూ.1350లకు కొనుగోలు చేస్తామని వ్యాపారస్తులు చెబుతున్నారు. దీంతో ధాన్యం ధరలు ఆశాజనకంగానే ఉండవచ్చునని రైతులు భావిస్తున్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతురావు

ఉపకార వేతనాలు పంపిణీ

ప్రజాశక్తి -మంగళగిరి

పట్నంలోని శ్రీ మార్కండేయ ఎడ్యుకేషనల్ సొసైటీ 39వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం మార్కండేయ కళ్యాణ మండపంలో పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సొసైటీ అధ్యక్షులు మురుగుడు హనుమంతరావు అధ్యక్షత వహించారు. రూ.14 లక్ష ల ప్రాథమిక విద్య నుండి ఉన్నత చదువులు చదువుకునే పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, నోట్ పుస్తకాలు, క్యాలిక్యులేటర్లు, పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి పి రాజశేఖర్, ప్రముఖ పారిశ్రామికవేత్త రామా శ్రీనివాస్, పి. లక్ష్మీ భీమేష్, నీలి కృష్ణ రాజేంద్ర, బి వెంకట వీరాంజనేయులు, మాజీ మున్సిపల్ చైర్మన్ గంజి చిరంజీవి, జి. బాబు వరప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం సొసైటీ మాజీ కార్యదర్శి ఎం.విజయ మోహన్‌రావును ఘనంగా సత్కరించారు.

ఉపకార వేతనాలు అందజేస్తున్న మంగబాబు తదితరులు

మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

విద్యార్థులు పాఠశాల దశ నుంచే ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని, క్రమశిక్షణతో చదవాలని విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి రంగిశెట్టి మంగబాబు అన్నారు. పట్టణానికి చెందిన కృష్ణదేవరాయ ఎద్యుకేషనల్ ప్రోగ్రెసివ్ అసోసియేషన్(కెపా) ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌టిఓ కల్యాణమండపంలో ఆదివారం ఏర్పాటు చేసిన మెరిట్ స్కాలర్‌షిప్‌ల పంపిణీలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రియదర్శిని విద్యాసంస్థల అధ్యక్షులు చందు రామారావు మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు స్కాలర్‌షిప్‌లు అందజేయడం అభినందనీయమన్నారు. దివీస్ హాస్పిటల్ లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ చందు ఉదయభాస్కర్, శ్రీ చక్ర వైద్యశాల డాక్టర్ కమ్మెల హరీష్ సభలో ప్రసంగించారు. కార్యక్రమంలో భీమవరం ఎన్ఫోజైమ్ టెక్నాలజీ లిమిటెడ్ డైరెక్టర్ ఎస్.పద్మజ్యోతి, కెపా అధ్యక్ష కార్యదర్శులు బి.వెంకటనారాయణ,టి. చిన్నాబ్బాయి, పున్నారావు, సాయికృష్ణ, బ.కృష్ణారావు పాల్గొన్నారు.

మేధో శక్తిని పెంచేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు దోహదం

ప్రజాశక్తి- మేడికొండూరు

విద్యార్థుల మేధో శక్తిని పెంపొందించేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు ఎంతగానో దహదపడతాయని ఇస్రో శాస్త్రవేత్త సిహెచ్ రాజేందర్ అన్నారు. మండలంలోని పేరేచర్ల ఇంటెల్ హైస్కూల్లో రెండు రోజుల సైన్స్ ఎగ్జిబిషన్ ఆదివారం ఘనంగా ముగిసింది. కార్యక్రమంలో ఇస్రో శాస్త్రవేత్త రాజేందర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ మేధస్సుకు పోదును పెట్టి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని పరిశోధన దిశగా ముందుకు సాగాలని అన్నారు. నేటి ప్రతిభావంతులు రేపటి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు చేసిన ఎక్స్‌పర్‌మెంట్‌లను ప్రథమ, ద్వితీయ స్థానాలలో ఎంపిక చేసి బహుమతి ప్రధానోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంటెల్ హైస్కూల్ డైరెక్టర్ డాక్టర్ కోనూరి జయకుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడికొండూరు ఎంపిపి మన్నవ స్వప్న రాజేష్, ఇంటెల్ హైస్కూల్ ప్రిన్సిపల్ కోనూరి అశోకరాణి, జయకుమార్. వ్యాయామ ఉపాధ్యాయుడు షేక్ రన్ను హుస్సేన్, పలువురు అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సూచనలు ఇస్తున్న సైంటిస్ట్ రాజేందర్

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

సెల్ఫోన్ వినియోగదారులకు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండేందుకు అవగాహన కార్యక్రమం సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్‌మేషన్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుంటూరు వారి ఆధ్వర్యంలో ఆదివారం ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి దళితవాడలో నిర్వహించారు. ప్రధానంగా ఫిషింగ్ కాల్స్ ద్వారా జరిగే మోసాలు, ఆన్లైన్ మార్కెటింగ్‌లో జరిగే మోసాలు, క్రెడిట్ కార్డు పై వార్షిక ఫీజు రాయితీ అంటూ మోసపూరిత ఆఫర్లను, క్యూఆర్ కోడ్ ద్వారా, ఏటీఎం కార్డుల స్కిమ్మింగ్‌లలో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తదితర అంశాలపై నిర్వాహకులు వివరించారు. ప్రైవేట్ బ్యాంకుల కంటే, ప్రభుత్వ రంగ బ్యాంకులో ముద్దు అని ఆన్లైన్ మోసాల పట్ల ఆకర్షితులై మోసపోవద్దని నిర్వాహకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఎఫ్ఎల్ రామ కిరణ్ కుమార్, అంకమ రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైశ్య విద్యానిధిలో కంప్యూటర్ శిక్షణ

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక లక్ష్మీ డీలక్స్ కూడలిలోని ఆర్య వైశ్య విద్యానిధి భవనంలో కంప్యూటర్ శిక్షణా కేంద్రాన్ని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. వైశ్య విద్యానిధిలో అదే సామాజిక వర్గానికి చెందిన పేద విద్యార్థులకు హాస్టల్ వసతి ఏర్పాటు చేసిన నిర్వాహకులు వారికోసం కంప్యూటర్ శిక్షణను కూడా ఏర్పాటు చేశారు. విద్యానిధి బృందాన్ని ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అభినందించారు. కార్యక్రమంలో పెండేల వెంకట్రావ్, వైశ్య విద్యానిధి పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

శిక్షణా కేంద్రాన్ని ప్రారంబిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి

సత్యనారాయణ స్వామి వ్రతం

ప్రజాశక్తి-గుంటూరు

నల్లపాడులోని స్వయంభూ శ్రీ పుష్పాద్రి లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రంలో శ్రీ రమాసహిత సత్యనారాయణస్వామి వ్రతంను సామూహికంగా దంపతులతో, క్షేత్ర ప్రాంగణంలో విశేష యాత్రికుల మధ్య అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం కార్తీక వనసమారాధనను కమిటీ సభ్యులు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బెండపూడి వెంకట సీతారాం, లక్ష్మీ నరసింహం, తిరుపతిరెడ్డి, నరసింహారావు, సభ్యులు పాల్గొన్నారు.

వృతంలో పూజలు చేస్తున్న దంపతులు

బండి జోసఫ్ రాజు(ఫైల్),నివాళులర్పిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఆర్ఎంపి వైద్యులు జోసఫ్‌రాజు మృతి

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం గ్రామానికి చెందిన ప్రముఖ ఆర్ఎంపి వైద్యులు బండి జోసఫ్‌రాజు(బుజ్జిడాక్టర్) (64)ఆదివారం తెలవారుజామున ఆయన స్వగృహంలో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వృత్తిరీత్యా ఆర్ఎంపిగా ఉంటూ, సిపిఎం సానుభూతిపరుడుగా, గ్రామంలో జరిగే పార్టీ కార్యక్రమాలకు తనవంతు సాయంగా గ్రామ శాఖకు తోడ్పడేవారు. బుజ్జి డాక్టర్ తండ్రి రాజగోపాలం కూడా ఆర్ఎంపీ వైద్యునిగా గ్రామంలో విశిష్ట వైద్య సేవలందించారు. ఆయన మృతి తెలుసుకున్న సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి బుజ్జి డాక్టర్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సిపిఎం సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ వడ్డేశ్వరం బిక్షాలు , సిపిఎం శాఖ కార్యదర్శి వడ్డేశ్వరం పున్నయ్య, సిఐటియు నాయకులు వడ్డేశ్వరం బాబురావు, మంగళగిరి, తాడేపల్లి, తుళ్లూరు మండలాల ఆర్ఎంపి వైద్యుల అసోసియేషన్ సెక్రటరీ జి.గోపాల్, వైస్ ప్రెసిడెంట్ సిహెచ్ శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.కరిముల్లా, పిసి మెంబర్స్ షేక్ అమినుల్లా, ప్రెసిడెంట్ కె.హేమ సుందర్, ట్రెజరర్ పిబి.ఎం మల్లేశ్వరరావు, శారద తదితర వైద్యులు, పలువురు గ్రామస్తులు ఆయన భౌతికాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

25న పార్లమెంట్ మార్చ్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మంగళగిరి

ఈ నెల 25న ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో తలపెట్టిన పార్లమెంట్ మార్చ్‌ను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల నాసర్‌జి కోరారు. ఆదివారం వేములపల్లి శ్రీ కృష్ణ భవన్లో గోడపత్రిక ఆవిష్కరణలో ఆయన పాల్గొని మాట్లాడారు. నూతన జాతీయ విద్యా విధానం వల్ల లక్షల సంఖ్యలో గ్రామీణ విద్యార్థులకు విద్య దూరం అవుతుందని, విద్యా వ్యవస్థను కార్పొరేట్ వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం జరుగుతుందని అన్నారు. అదే విధంగా చరిత్రను వక్రీకరించే విధంగా గాడ్సే గొప్ప దేశ భక్తుడిగా పుస్తకాలలో ముద్రించడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలన్నారు. అదే విధంగా విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగ సంస్థ గానే కొనసాగించేంత వరకు మా పోరాటం ఆగదని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుభాని మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వస్తే 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని హామి మోసం చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జంగాల చైతన్య , షేక్. వలి నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు నవీన్, గోపి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కేఫ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలిలో లెట్స్ స్కూప్ ఐస్‌క్రీమ్ కేఫ్ ప్రారంభం

రాష్ట్రంలో ఏపీలో తొలి ఫ్రాంచైజ్ తెనాలిలో ఏర్పాటు

హర్షణీయమన్న ఎమ్మెల్యే శివకుమార్

ప్రజాశక్తి-తెనాలి

ఆంధ్రాప్యారిస్ తెనాలిలో నూతన వ్యాపారాలకు శ్రీకారం చుట్టడం ఈ ప్రాంతానికే గర్వకారణమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. స్థానిక చెంచుపేట ఆర్‌సిఎం చర్చి ఎదుట నూతనంగా ఏర్పాటు చేసిన 'లెట్స్ స్కూప్' ఐస్‌క్రీమ్ కేఫ్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పొరుగు రాష్ట్రాల్లో రెండు బ్రాంచీలను కలిగిఉన్న ఈ కేఫ్ మూడవ బ్రాంచ్‌కి తెనాలిని ఎంపిక చేసుకోవడం అభినందనీయమన్నారు. ఫ్రాంచైజ్ యజమాని అనిల్ దేవరపల్లి మాట్లాడుతూ లెట్స్ స్కూప్ ఐస్‌క్రీం ఫ్రెష్ ఫ్రూట్స్, డ్రైఫ్రూట్స్‌తో పాటు కోల్డ్‌స్టోన్‌తో తయారు చేసిన ఐస్‌క్రీమని, నాణ్యతలో గొప్పదని అన్నారు. అంతర్జాతీయ బ్రాండ్లతో సమానంగా రుచి, సుచిలో పోటీ పడుతోందన్నారు. పిస్తా, చాక్లెట్, మామిడి, వెనిల్లా, స్ట్రాబెర్రీ, బటర్‌స్కాచ్‌తో పాటు మరికొన్ని కొత్త రుచులను అందించనున్నామని తెలిపారు. చాకో ఓ హెవెన్, డేట్ ఓ నట్స్ ఐసీక్రీం ప్రత్యేకతలుగా చెప్పారు. కార్యక్రమంలో నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారుల మెరుగుదలకు చర్యలు

- రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు
- 16 అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణం
- రూ.145 కోట్లతో మార్కెట్ ఆధునికీకరణ
- ప్రజాశక్తితో మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు

గుంటూరు నగరంలో అభివృద్ధి పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయని మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు తెలిపారు. రహదారులు, కల్వర్టులు, డ్రెయిన్ల నిర్మాణంతోపాటు వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని అన్నారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలిపారు.

ఇంటర్వ్యూ

యుజిడి వల్ల దెబ్బతిన్న రహదార్లను అభివృద్ధి చేస్తున్నారా?

గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన యుజిడి నిర్మాణం కోసం రహదారులన్ని తవ్వేశారు. వీటిని సంబంధిత సంస్థ తిరిగి నిర్మించాల్సి ఉన్నా వారు పూర్తిగా నిర్మించలేదు. ప్రజలు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కొన్ని రహదారులను ప్రాధాన్యతా క్రమంలో కార్పొరేషన్ వేయిస్తోంది. దాదాపు రూ.70 కోట్లతో రహదారుల నిర్మాణం వేగంగా జరుగుతోంది. ఏటి అగ్రహారం ప్రధాన రహదారి అభివృద్ధి పనులనూ త్వరలో చేపడతాం. వీటితో పాటు కల్వర్టులు, డ్రెయిన్ల నిర్మాణానికి రూ.200 కోట్లతో పనులు చేపట్టాం.

పనులు తిరిగి ఎప్పుడు ప్రారంభమవుతాయి?

యుజిడి పనులు 50 శాతానికి పైగా పూర్తయ్యాయి. మిగతా పనులను చేపట్టేందుకు ఉన్నత స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ దృష్టికి ప్రజా ప్రతినిధులమంతా తీసుకెళ్లాం. ఇటీవల గుంటూరు వచ్చినప్పుడు సిఎం ఈ అంశంపై మాట్లాడారు. రూ.287 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. త్వరలో పనులు మొదలవుతాయని భావిస్తున్నాం. యుజిడితో పాటు శంకర్‌విలాస్ బ్రిడ్జి విస్తరణకు రూ.131 కోట్లు సిఎం కేటాయించారు. ఈ రెండు పనులు ప్రారంభమైతే నగరంలో చాలా వరకు సమస్యలు పరిష్కారమవుతాయి.

అర్బన్ హెల్త్ సెంటర్లు ఎన్ని నిర్మించారు?

గుంటూరు కార్పొరేషన్ పరిధిలో 16 అర్బన్ సెంటర్ల నిర్మాణం చేపట్టాం. వీటిల్లో ఇప్పటికే 10 వరకు ప్రారంభమయ్యాయి. మిగతా వాటి నిర్మాణం చివరి దశలో ఉంది. నగరంలోని ఆయా ప్రాంతాల ప్రజలకు అర్బన్ హెల్త్ సెంటర్లు బాగా ఉపయోగపడుతున్నాయి.

కూరగాయల మార్కెట్ ఆధునికీకరణ పనులు?

పివికె నాయుడు కూరగాయల మార్కెట్ నూతన భవన సముదాయం నిర్మాణం త్వరలో చేపడతాం. ఇందుకోసం రూ.145 కోట్లతో పనులు ప్రారంభించాల్సి ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా శంకుస్థాపన చేయించాలని యోచిస్తున్నాం.

రక్షిత నీటి సరఫరా పథకం పురోగతి?

రక్షితనీటి పథకం నిర్మాణంలో భాగంగా శివారు గ్రామాలకు నీటి వసతిని కల్పించేందుకు గోరంట్ల కొండపై రిజర్వాయర్ నిర్మాణం జరుగుతోంది. ఇది త్వరలో పూర్తవుతుంది.

పార్కుల అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

గాంధీపార్కు అభివృద్ధికి రూ.2 కోట్లతో త్వరలో పనులు ప్రారంభించనున్నాం. మిగతా పార్కుల అభివృద్ధికి కూడా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

అలరించిన కళా ప్రదర్శనలు

ధరల పెరుగుదలపై నాటిక

ప్రజానాట్య మండలి కళాకారులు గేయాలాపన

చిన్నారుల నృత్య ప్రదర్శన



ఉయ్యూరు రైతు

రైతులు అనేక కష్టాలకోర్చి వ్యవసాయం చేస్తుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లంటూ తెచ్చిన విధానం రైతులకు ఉరితాళ్లుగా మారుతుందనే ఇతివృత్తంతో ప్రదర్శించిన మోటార్లకు మీటర్లు నాటిక రైతుల ఆవేదనకు అద్దం పట్టింది.

కౌలురైతూ మనిషే.. అంటూ కృష్ణా జిల్లా ఉయ్యూరుకు గిద్దలూరు కోటేశ్వరరావు అనే సన్నకారు రైతు ప్లకార్డు చేతబూని చిలకలూరిపేట పట్టణంలో ప్రచారం చేశాడు. కౌలు రైతుల రాష్ట్ర మహాసభలు సందర్భంగా ఆయన చేసిన ప్రచారం అందరి దృష్టినీ ఆకర్షించింది.

చిలకలూరిపేట, పల్నాడు జిల్లా

కౌలు రైతు సంఘం రాష్ట్ర 3వ మహాసభ సందర్భంగా చిలకలూరిపేట పట్టణంలోని కళామందిర్ సెంటర్లో ఆదివారం ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తేళ్ల ఆదినారాయణ వేదికపై కళాకారులు, చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

మోటార్లకు మీటర్లపై నాటిక

పాయ ఉల్లిపాయ.. వంటిల్లు వదిలి వెళ్లిపోయే ఉల్లిపాయ.. పాయెకు దండామే.. అంటూ పెరిగిన నిత్యావసర ధరలు, వంట గ్యాస్ ధరలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై వ్యంగ్యోక్తులతో కూడుకున్న ప్రదర్శన వాస్తవాలను తెలియజెప్పింది.

గర్భగుడిలో ఎనిమిది రోజులు పసిపాపను నిర్బంధించి అత్యాచారం, ఆపై హత్య చేసిన దారుణమే ఇతివృత్తంగా ప్రదర్శించిన 'ఆసిఫా' నాటిక ప్రేక్షకులను కన్నీళ్లు పెట్టించింది. మానవ మృగాల చేతిలో ఛిద్రమైన ఆసిఫా ఘటనలను హృద్యంగా ప్రదర్శించగా అందరి హృదయాలూ చలించాయి.

కోలాట ప్రదర్శన

ప్రజానాట్య మండలి కళాకారులు ఆలపించిన అభ్యుదయ గేయాలు ఎంతగానో ఆలోచింపజేశాయి. మతమేదైతేనేనా మనుషులే అంటూ ఆలపించిన గేయానికి హర్షధ్వానాలతో అభినందనలు వచ్చాయి. మహనీయుల త్యాగాలను.. బుస్సున పొంగే బీరు.. పెప్సికోల వచ్చేనా ఇళ్లలోకి.. భారతదేశం బాకిన పడ్డదిరో.. చుట్టం వస్తే రో మా ఇంటికి ఓయమ్మో.. భరతమాతను మళ్లీ చేస్తారా బానిసను.. వందేమాతరం.. తదితర గేయాలు చైతన్య స్ఫూర్తినిచ్చాయి.